క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డి హనుమకొండలోని నివాసంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని సోమవారం సన్మానించారు. తొలుత పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

ప్రీతమ్‌కు..



వర్ధన్నపేట : ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతమ్‌ను కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య సోమవారం శాలువాతో సన్మానించారు. తొలుత హైదరాబాద్‌లోని నివాసంలో ప్రీతంను వెంకటయ్య కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటయ్య వెంట నాయకులు గబ్బెట బాబు, కందిక వీరస్వామి, కొండేటి మధుకర్ ఉన్నారు.

అభినందన



వర్ధన్నపేట : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఇనుగాల వెంకట్రాంరెడ్డిని అతడి నివాసంలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం అభినందించారు. తొలుత వెంకట్రాంరెడ్డిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలబోకె అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు వెంకటనర్సింహారెడ్డి, పిన్నింటి అనిల్‌రావు, బోటు, రుద్వేగ్ ఉన్నారు.

పోలీసుల కవాతు




పర్వతగిరి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా పద్మశాలి కాలనీ, ఇతర వీధుల్లో పోలీసులు సోమవారం కవాతు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతి మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని చెప్పారు. సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై గుగులోతు వెంకన్న, సీఆర్పీఎఫ్ సీఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి సాయం



ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మరాటి పాపయ్య కూతురు వివాహానికి పాపయ్యతో 1996–97లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.30,164 సాయం అందజేశారు. ఈ సందర్భంగా పాపయ్య స్నేహితులు సోమవారం జరిగిన వివాహానికి హాజరై నగదు అందించారు. కార్యక్రమంలో పాపయ్య స్నేహితులు అక్బర్, అజహర్, హైమద్‌పాషా, సుధాకర్, వీరన్న, రమేశ్, నర్సు, రాజన్న, వసురాం, రవీందర్, ఇస్మాయిల్, మోయినొద్దీన్, రాజు, యాకాంతం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



గీసుకొండ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు పసునూటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎలగొండ ప్రవీణ్‌తోపాటు పలువురు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమక్షంలో కాంగ్రెస్‌లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి మురళి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ సర్పంచ్ మ్యాదరబోయిన చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు నమిండ్ల క్లిమెంట్, జన్ను నర్సయ్య, ఇంద మనోజ్, ఏకుల రాజు, జన్ను లెనిన్ ఉన్నారు. కార్యక్రమంలో నాయకుడు కట్కూరి రవి, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



నల్లబెల్లిలో..



చెన్నారావుపేటలో..

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ, రాయపర్తి, పర్వతగిరి, సంగెం, తదితర మండలాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అధికారులు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. 144 సెక్షన్ అమలు చేశారు. పలు కేంద్రాలను అధికారులు సందర్శించారు.



సంగెం : పరీక్ష కేంద్రం వద్ద ..



పర్వతగిరి : మోడల్ స్కూల్ వద్ద..

ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కొమురయ్య, మహిళలు

వర్ధన్నపేట : ప్రతీఒక్కరు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని డీఆర్డీఏ సీసీ గోలి కొమురయ్య కోరారు. మండలంలోని ఇల్లందలో కావేరి గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ కొమురయ్య మాట్లాడారు. ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నివారిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమౌతుందని చెప్పారు. ప్లాస్టిక్ నివారణకు మహిళలు నడుం బిగించాలని కోరారు. అనంతరం ప్లాస్టిక్‌ను నివారిస్తామంటూ మహిళలు ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో వీఓ అధ్యక్ష కార్యదర్శులు స్వప్న, కల్పన, మాధవి, వీఓఏ రమ్య, స్వయం సహాయక సంఘాల లీడర్లు రాధిక, మమత పాల్గొన్నారు.

ఎంపీఓపై ఎంపీపీ దాడి సరికాదు



నల్లబెల్లి : నిరసన తెలుపుతున్న పీఆర్ ఉద్యోగులు

నల్లబెల్లి : నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో ఎంపీఓపై ఎంపీపీ దాడి చేయడం సరికాదని ఎంపీడీఓ నర్సింహమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఎంపీవోపై దాడి చేసిన ఎంపీపీపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ధర్మేందర్, పంచాయతీ కార్యదర్శులు పద్మనాభస్వామి, రజిత, శాంత, జ్యోతి, అనిత, యాదగిరి, రంజిత్, శ్రీకాంత్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురంలో..

ఖానాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈగల భారతి మాట్లాడారు. అధికారిపై దాడిని ఖండించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు యుగేందర్, వరుణ్, సుప్రజ, అబేద, తదితరులు పాల్గొన్నారు.

‘ఫసల్ బీమా’తో రైతన్నకు భరోసా

● వానకాలం నుంచి అమలు

వర్ధన్నపేట : వానాకాలం నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో రాష్ట్ర ప్రభుత్వం చేరనుంది. తద్వారా పంట నష్టం జరిగినపుడు రైతులకు మేలు జరుగుతుంది. జిల్లాలో 2016 నుంచి 2020 వరకు రాష్ట్రం ఫసల్ బీమా పథకంలో ఉంది. నాడు చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించారు. ఆ తర్వాత నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం నుంచి తప్పుకుంది. దీంతో రైతులకు పంటల బీమా అందక నష్టపోయారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పీఎం ఫసల్ బీమాలో చేరాలనే నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

తక్కువ ప్రీమియం

ఈ పథకంలో రైతులు అతి తక్కువ ప్రీమియం చెల్లిస్తారు, ఆహార ధాన్యాలు, నూనె గింజలకు ప్రతీ సీజన్‌కు ఒకే రకమైన ప్రీమియాన్ని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు వానాకాలంలో 2, యాసంగిలో 1.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మిగతా మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా బీమా కంపెనీలకు చెల్లిస్తాయి. పంట నష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం నగదును నేరుగా బాధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పొలంలో ఉన్న పంటకు జరిగిన నష్టంతోపాటు పంట కోత తర్వాత జరిగే నష్టాలకు కూడా బీమా వర్తిస్తుంది. వరద ముప్పు వంటి విపత్తులకు కూడా పరిహారం అందుతుంది.

సాంకేతికంగా నష్టం అంచనా

పంట నష్టాన్ని అంచనా వేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. కోతల తర్వాత జరిగే నష్టాన్ని పొలం స్థాయిలోనే అంచనా వేస్తారు. బ్యాంకు రుణం తీసుకున్న రైతులు తప్పనిసరిగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

రైతులకు చాలా ప్రయోజనం



ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు చాలా మేలు చేస్తుంది. సాగు చేసిన పంటలు చేతికొచ్చే వరకల్లా ఎప్పుడు విపత్తు ఎదురయ్యేదీ తెలియదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లముందే దెబ్బతింటే రైతులు వేదనకు గురవడం ఖాయం. ఈ క్రమంలో రైతులను ఆదుకునేలా రానున్న వానాకాలం నుంచి రైతులు ఫసల్ బీమా యోజన పథకంలో చేరి లబ్ధి పొందాలి.

-రాంనర్సయ్య, వ్యవసాయాధికారి, వర్ధన్నపేట

సీపీఆర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్నేహ

నర్సంపేట : సీపీఆర్‌పై యువతకు అవగాహన అవసరమని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ తెలిపారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ స్నేహ మాట్లాడారు. సీపీఆర్ విధానాన్ని వాలంటీర్ల సహాయంతో ప్రదర్శిస్తూ కళ్లకు కట్టారు. అనంతరం వాలంటీర్ల చేత ప్రాక్టీస్ చేయించారు. సీపీఆర్‌పై యువత, విద్యావంతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ రక్తనిధి టెక్నీషియన్ రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాంపల్లి శ్రీనివాస్, శ్రీధర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో జాజిరి సందడి



చెన్నారావుపేట : హోళి పర్వదినాన్ని పురస్కరించుకుని 9 రోజులపాటు నిర్వహించే జాజిరి ఆటల సందడి మండలంలోని పలు పల్లెల్లో మొదలైంది. జాజిరి జాజిరి జాజిరిజా.. వీరన్న బల్లికోడె అంటూ చిన్నారులు ఆడుతూ, పాడుతూ జనాన్ని ఓలలాడిస్తున్నారు. చిన్నారులు, యువకులు, యువతులు ఉత్సాహంగా పాల్గొంటుండడం గమనార్హం.

ఎస్సైగా రామారావు బాధ్యతల స్వీకరణ



నల్లబెల్లి : ఎస్సైగా రామారావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన నైనాల నగేశ్ వీఆర్‌కు బదిలీ కాగా హనుమకొండలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రామారావును అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. తొలుత ఎస్సైకి హెడ్ కానిస్టేబుళ్లు ప్రభాకర్, రవీందర్, కానిస్టేబుళ్లు సురేశ్, రాకేశ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నర్సంపేట : పార్టీలో చేరిన వారితో రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మహబూబాబాద్ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాం నాయక్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. అన్ని బూత్‌ల్లో పది మందిని పార్టీలో చేర్చే కార్యక్రమాన్ని పట్టణంలోని రెండో డివిజన్‌లో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 40 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ హయాంలోనే సుపరిపాలన అందుతుందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం, రాష్ట్రం పురోగతి సాధిస్తున్నాయని తెలిపారు. దేశాన్ని అభివృద్ధి చేయడంలో ప్రధాని మోదీ అహోరాత్రులు శ్రమిస్తున్నారని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ రేసు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పట్టణ ఇన్‌చార్జ్ గుడిపూడి రాధాకృష్ణ, శ్రీరంగం సాగర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

‘కుమారస్వామినే కొనసాగించాలి’

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రస్తుత అధ్యక్షుడు చిదురాల కుమారస్వామినే మళ్లీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ అఫ్సర్, సమ్మెట సుధీర్ స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కోరారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుమారస్వామి పట్టణ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని, పార్టీ అధికారంలో లేని సమయంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. పార్టీతో సంబంధం లేని వ్యక్తిని పట్టణ అధ్యక్షుడిగా నియమించడం సరికాదన్నారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం చిదురాల కుమారస్వామి మాట్లాడారు. తాను నిత్యం పార్టీ బలోపేతానికి పాటుపడినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బచ్చు గంగాధర్‌రావు, శివరాత్రి వెంకటనర్సు, కొండేటి బాలకృష్ణ, ఐత సుధాకర్, ఎర్ర ప్రేమ్‌రాజ్, సమ్మెట రాంబాబు, షబ్బీర్, మంజూర్, బంగారు సదానందం, ఎల్లస్వామి, మురళి, చందు మల్లయ్య, జగన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్సర్

అత్యధిక మెజార్టీ సాధించాలి



నర్సంపేట : మాట్లాడుతున్న మనీశ్

నర్సంపేట : పార్లమెంటు ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా యువత నడుం బిగించాలని యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీశ్‌గౌడ్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్’ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. యువమోర్చా కార్యకర్తలందరూ కష్టపడి పని చేయాలని తెలిపారు. సమావేశంలో యువమోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్, నల్లబెల్లి మండల అధ్యక్షుడు కూరపాటి సాయి, నర్సంపేట యువమోర్చా ప్రధాన కార్యదర్శి ఠాకూర్ విజయ్‌సింగ్, సామల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు కోమండ్ల సప్తగిరి, యువ మోర్చా నాయకులు మండ కార్తీక్ రాజ్, చిలువేరు అన్వేశ్, భవాని శంకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న కుమారస్వామి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

వర్ధన్నపేట : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మండలం నుంచి బీజేపీ అభ్యర్థికి మెజార్టీ సాధించడం కీలకమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి తెలిపారు. మండలంలోని ఇల్లందలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.మండలంలో నాయకత్వం బలంగా ఉండాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీకి మండల స్థాయిలో అత్యధిక ఓట్లు పోలయ్యేలా శ్రేణులు క్రియాశీలకంగా పని చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తాళ్లపెల్లి కృష్ణమూర్తి, డోలి సతీశ్, నర్సింగరావు, చీపురు వెంకటస్వామి, నాంపెల్లి యాకస్వామి, పోశాల సురేశ్, చెంగల సురేశ్, కర్ర సోమిరెడ్డి, న్యాలం సాయిలు, గుగులోతు లక్‌పతి, మైస రాజు, కత్తి రాజు, శ్రీనివాస్, దూదయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తో బంగారు భవిష్యత్‌కు బాటలు



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న చైర్మన్ గోపాల్‌రెడ్డి

చెన్నారావుపేట : సైన్స్‌పై పట్టు సాధిస్తే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ స్కూల్‌లో ఒకటి నుంచి మూడో తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులు సోమవారం సైన్స్‌ఫెయిర్ ఉత్సవాలు నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోపాల్‌రెడ్డి ఎగ్జిబిట్లను తిలకించి విద్యార్థులను పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మేడి రమేశ్‌గౌడ్, జక్కుల జగదీశ్వర్, వల్ల వేణు, గణేశ్, బొనగాల రమేశ్, కృష్ణమోహన్, విష్ణు, నామాల సృజన, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



పర్వతగిరి : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో పెరిక కుల సంఘం నాయకులు సోమవారం క్షీరాభిషేకం చరేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. పెరిక కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ కుల సంఘం అధ్యక్షుడు నరెడ్ల సమ్మయ్య, నాయకులు చింతకుంట్ల మల్లికార్జున్, మండల రవి, కంఠం సుధాకర్, సముద్రాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గూడూరు: లోకసభ ఎన్నికల దృష్ట్యా వాహనదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ శ్వేత, సీఐ కె.బాబూరావు అన్నారు. మండలంలోని భూపతిపేట ఫారెస్టు చెక్ పోస్టు వద్ద ఎన్నికల కోడ్ దృష్ట్యా కొత్తగా చెక్‌పోస్టును వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల కోడ్ పాటించాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. న్నారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ నగేష్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలపై వడ్డీ మాఫీ

తొర్రూరు: ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేయనున్నామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా పురపాలక శాఖ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ అవగాహన కల్పించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గూడూరు: పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండలంలోని చిర్రకుంటతండా, బొద్దుగొండ, పలు గ్రామాల్లో సోమవారం పోషణమాస పక్వాడపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నీలోఫర్ అజ్మీ మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

‘చందా పేరుతో వసూళ్లు’

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఓ కాలనీలో గుడి నిర్మించగా ఆలయ ప్రారంభోత్సవం చేసేందుకు ఉత్సవ కమిటీ సిద్ధమవుతోంది. ఈక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బలవంతపు వసూళ్లకు తెగబడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగినంత ఇచ్చుకోలేమని ప్రాధేయపడినా వదలడం లేదని వాపోతున్నారు. ఆర్థిక భారంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. భక్తితో ఇచ్చే డబ్బులు తీసుకెళ్లకుండా రూ.1016లకు తగ్గొద్దంటూ హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. చందాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

తొర్రూరు: ఎరుకల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని ఎరుకల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ కోరారు. ఎరుకల సంఘం 68వ వార్షికోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఎరుకల కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగమణి, సావిత్రి, మానస, రమ, జ్యోతి, యాకమ్మ, ముత్తిలింగమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి



ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం దాడులు చేసి రూ.15,760 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. ఈమేరకు నిందితులు పండరి రమేష్, బొంత సంపత్, మట్ల విద్యాసాగర్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యకు అప్పగించినట్లు తెలిపారు.